క్లుప్తంగా

బైక్‌లో చెలరేగిన మంటలు

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని గాంధీబొమ్మ సర్కిల్ సమీపంలో మంగళవారం నిలిపి ఉన్న ఓ ద్విచక్ర వాహనంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు నీరు, ఇసుక చల్లి మంటలను ఆర్పివేశారు. అయితే బైక్ ఎవరిదనేది తెలియరాలేదు. ఇదే సమయంలో బైక్ వైరింగ్ షార్ట్‌సర్క్యూట్ వలన ప్రమాదం సంభవించిందా లేక ఎవరైనా నిప్పంటించారా అనేది తెలియాల్సి ఉంది.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించారు. పాండురంగస్వామి ఆలయం వద్ద ఉన్న చెత్త పాయింట్‌ను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. గాంధీ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ వద్ద ఉన్న కాలువలో సిల్ట్‌ను సిబ్బందిచే తొలగించారు. గీతాశ్రమం వీధిలో ఇంటింటి చెత్త సేకరణను కమిషనర్ పరిశీలించి ప్రజలతో మాట్లాడి రోజు చెత్త సేకరణకు వస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా పాల్గొన్నారు.

పంటలకు ఇ-క్రాప్ చేయించాలి

బి.కోడూరు : రైతులు తమ పంటలను ఇ-క్రాప్‌లో నమోదు చేయించాలని మండల వ్యవసాయాధికారిణి కౌశిక తెలిపారు. మంగళవారం మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పెసర, వరిపంట పొలాలను పరిశీలించి ఎరువుల వాడకం, సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు సూచనలు చేశారు. ఇ-పంట నమోదు, ఇ-కేవైసీకి ఈ నెల 25 చివరి తేదీ అని, రబీలో సాగు చేసిన రైతులు ప్రతి పంటను నమోదు చేసుకోవాలని తెలిపారు. అలానే రైతు విశిష్ట సంఖ్య కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ఈనెల 11, 12, 13 తేదీల్లో నిరసన కార్యక్రమాలను చేస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులకు 36 జీఓను అమలు చేసి వేతనాలను పెంచాలని పేర్కొన్నారు. వారికి కేవలం రూ.15 వేలు ఇస్తూ రూ.2వేలు పీఎఫ్, ఈఎస్ఐ కట్ అవ్వగా చేతికి రూ.13వేలు వస్తోందన్నారు. దీంతో పెరిగిన ధరలతో కుటుంబాలు గడవాలంటే చాలా కష్టంగా ఉందన్నారు. కార్మికుల అర్హతను బట్టి స్కిల్, సెమిస్కిల్ వేతనాలను ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆప్కాస్ ద్వారా దళారి వ్యవస్థ లేకుండా కార్మికులందరికీ ఒకటో తేదీనే జీతాలు పడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగిస్తామని చెబుతున్నారన్నారు. దీనిని ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

పరామర్శ



సుదర్శన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డి ఇటీవల గుండెకు సంబంధించి స్టంట్ వేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మంగళవారం సుదర్శన్‌రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హనుమంతరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్, నాగసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సాయినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్, కేసులు నమోదు

పోరుమామిళ్ల : ఆటో డ్రైవర్లకు మంగళవారం సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళుతున్న ఆటోలను ఆపి, వారిపై కేసులు నమోదు చేశారు. అదే సమయంలో ఆటో డ్రైవర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, యూనిఫాం కలిగిఉండాలని, ఓవర్ లోడుతో వెళ్లరాదని కౌన్సిలింగ్ ఇచ్చారు. డ్రైవర్ పక్కన కూర్చోపెట్టుకున్నా, ఆటోలో నిలబడి ప్రయాణం చేసినా కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని హెచ్చరించారు.

13న కంటి వైద్య శిబిరం

బి.కోడూరు : పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన మండల పరిసర ప్రాంతాల ప్రజలకు ఉచిత ప్రత్యేక కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు పి.అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బి.కోడూరులో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు.

మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి

జాయింట్ కలెక్టర్‌తో భూ నిర్వాసితులు



ప్రొద్దుటూరు రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అదితి సింగ్

ప్రొద్దుటూరు రూరల్ : వేంపల్లె-చాగలమర్రి నేషనల్ హై వే 440కు భూములు, ప్లాట్లు కోల్పోతున్న నిర్వాసితులతో మంగళవారం కొత్తపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తమ భూములను వ్యవసాయ భూములుగా పరిగణించి తక్కువ మార్కెట్ రేట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. ఇంటి జాగ విలువ ప్రకారం బహిరంగ మార్కెట్‌కు ఇంచుమించుగా ఉండేటట్లు తమకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎకరా బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.45 కోట్లు ఉందని, తమకు ఉన్న ఎకరాలో 95 సెంట్లు నేషనల్ హైవేకి పోతుందని రమణారెడ్డి అనే బాధితుడు జాయింట్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎకరా రూ.45 కోట్లు ఉండగా కేవలం రూ.25లక్షలు ఇస్తామని పేర్కొనడం బాధాకరమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆస్తిని కాపాడుకుంటూ వచ్చామని, ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం, బహిరంగ మార్కెట్‌కు పొంతన లేకుండా ఉందన్నారు. బహిరంగ మార్కెట్ విలువలను, క్షేత్రస్థాయిలో విచారించి అధికారులు తెలుసుకోవాలని దశమందం బాబు అనే బాధితుడు జేసీని కోరారు. తనకున్నది వ్యవసాయ భూమి అని చెప్పినా వినకుండా రిజిస్ట్రార్ కార్యాలయంలో గజానికి రూ.2,100 ప్రకారం ప్లాట్ల కింద రిజిస్ట్రేషన్ అధికారులు రిజిస్ట్రార్ చేశారని, రెవెన్యూ అధికారులు వ్యవసాయ భూమి కింద నేషనల్ హైవే రికార్డులో పొందుపరచడం ఎంత వరకు సబబని మాజీ కౌన్సిలర్ నరసింహులు అధికారులను ప్రశ్నించారు. తన తండ్రి ఎన్నో ఏళ్లుగా ఉప్పు వ్యాపారం చేసి ఒక ఇల్లు, కొంత స్థలాన్ని కొనుగోలు చేస్తే ఇప్పుడు ఆ ఇల్లు, స్థలం నేషనల్ హైవేకు పోవడం బాధాకరమని మహబూబ్ అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమ కుటుంబం మైలవరంలోని మునక ప్రాంతమైన ఖాదర్‌బాద్ గ్రామం నుండి ప్రభుత్వ నష్టపరిహారం తీసుకుని ప్రొద్దుటూరు మండలం ఖాదరబాద్‌కు వస్తే ఇక్కడ కూడా తమ స్థిరాస్తి నేషనల్ హైవేకి అధికారులు తీసుకుంటున్నారన్నారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెంట్‌కు రూ.2.6 లక్షలు చెల్లిస్తుందని తెలిపారు. బాధితులు ఒక సెంట్‌కు ఎంత మేర ఆశిస్తున్నారన్నది తెలిపితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ గంగయ్య, డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డి, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

సరైన నష్టపరిహారాన్ని అందించాలి

రాజుపాళెం : వేంపల్లె-చాగలమర్రి జాతీయ రహదారికి భూములు కోల్పోతున్న రైతులకు రిజిస్ట్రేషన్ విలువతో కాకుండా బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరను చెల్లించాలని రైతులు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండలంలోని కొర్రపాడు గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం జాతీయ రహదారి 440కు భూమి కోల్పోతున్న రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ రైతులతో మాట్లాడారు. గత మూడేళ్లగా భూమి క్రయ, విక్రయాల ఆధారంగా నష్టపరిహారం అందిస్తామని, జాతీయ రహదారికి భూమి కోల్పోతున్న రైతులకు ప్రస్తుతం ఇస్తున్న ఎకరాకు రూ.10.60 లక్షలు కాకుండా మరో రూ.5లక్షలు అదనంగా నష్టపరిహారం ఇస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు పక్కనే పోతున్న భూములకు సరైన పరిహారం ప్రకటించాలని బాధితులు కోరారు. కొర్రపాడు రెవెన్యూ గ్రామానికి సంబంధించి రోడ్డుకు భూమి కోల్పోతున్న రైతుల వివరాలతో అవార్డును ప్రకటిస్తామన్నారు. ఆ తర్వాత మరికొంత నష్టపరిహారం కోసం కలెక్టర్‌కు వినతి పత్రం అందించవచ్చని జేసీ తెలిపారు. భూమి కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రొద్దుటూరు పట్టణానికి తమ గ్రామం దగ్గరలో ఉందని, ఇక్కడ బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షలు పలుకుతోందని బాధితులు చెప్పారు. గ్రామ సభలో జాతీయ రహదారి భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డి, మండల సర్వేయర్ విజయభాస్కర్, ఆర్ఐ హుస్సేన్ రెడ్డి, వీఆర్ఓ అశోక్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డున పడకుండా చూడండి



నగర దీపికలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : దాదాపు 15 ఏళ్లగా పనిచేస్తున్న తమను రోడ్డున పడకుండా ఆదుకోవాలని ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న నగర దీపికలు వేడుకున్నారు. వారు మంగళవారం దొరసానిపల్లెలోని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి తమ సమస్యను విన్నవించారు. ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. ఇప్పుడు తమను తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డుపాలు అవుతాయని తెలిపారు. తమకు మద్దతు ఇవ్వాలని రాచమల్లును కోరారు. మీకు అండగా ఉంటామని రాచమల్లు వారికి చెప్పారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేతలుగా ఎస్వీ డిగ్రీకాలేజి



ట్రోఫీ అందుకుంటున్న విద్యార్థులు

జమ్మలమడుగు : యోగివేమన యూనివర్శిటీ పరిధిలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జమ్మలమడుగకు చెందిన ఎస్వీ డిగ్రీకాలేజి విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు కాలేజి కరస్పాండెంట్ పాల నాగేశ్వరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కాలేజిలో ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ స్థాయిలో కమలాపురంలోని సీఎస్ఎస్ఆర్, ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీకాలేజిలో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో యూనివర్శిటీ పరిధిలోని అన్ని కాలేజిల క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్స్‌లో యూనివర్శిటీ టీం, సాయి పరమేశ్వర కాలేజి టీంకు పోటీ జరిగింది. ఈపోటీల్లో ఎస్వీ కాలేజి విజేతలు కావడంతో యూనివర్శిటీ ప్రిన్సిపాల్ రఘురాంరెడ్డి, యూనివర్శిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు మెడల్స్ సర్టిఫికెట్లు, ట్రోఫీతోపాటు ఐదువేల నగదును అందించారన్నారు. కార్యక్రమంలో టీం కెప్టెన్ ప్రేమ్‌కుమార్, ఇతర క్రీడాకారులకు కాలేజి యాజమాన్యంతోపాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఈ-శ్రామ్‌లో వివరాలను నమోదు చేయండి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న రాజంపేట సర్కిల్ సహాయ కార్మిక కమిషనర్ పద్మావతి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని అసంఘటిత కార్మికుల వివరాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రామ్‌లో నమోదు చేయాలని రాజంపేట సర్కిల్ సహాయక కార్మిక కమిషనర్ పద్మావతి తెలిపారు. మండలంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ, స్థానిక సర్కిల్ 1, 2 లేబర్ ఆఫీసర్లతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలంలోని అసంఘటిత కార్మికుల వివరాలను ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది, వెలుగు సిబ్బంది, సచివాలయాల సిబ్బంది ద్వారా ఈ-శ్రామ్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ సూచించారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించని వారెవరైనా ఈ పథకానికి అర్హులన్నారు. ఏదైనా ప్రమాదం చోటు చేసుకుని కుటుంబ పెద్దను కోల్పోతే ఈ-శ్రామ్ కార్డు ఆసరాగా నిలుస్తుందన్నారు. ఈ-శ్రామ్‌లో నమోదై కార్డు పొందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో చనిపోతే రూ.2లక్షలు, 50 శాతంపైన వంద శాతం లోపు అంగవైకల్యం పొందితే రూ.లక్ష నుంచి రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ-శ్రామ్‌లో పేర్లు నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, సర్కిల్ -1 అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ లోకపావని, సర్కిల్-2 అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో కంది కొనుగోలు కేంద్రాన్ని ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంది పంటకు కనీస మద్దతు ధర క్వింటా రూ.7,550తో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో కందులు క్వింటా రూ.6వేలు ఉండగా ప్రభుత్వం రూ.7,550తో కొనుగోలు చేస్తోందని తెలిపారు. కందులు కొనుగోలు చేసిన ఐదు రోజుల్లోనే రైతుల ఖాతాలకు డబ్బు జమ చేస్తారన్నారు. ఏపీ మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ పరిమళ జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి కందులను కొనుగోలు చేసేందుకు జిల్లాలోని 8 కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రొద్దుటూరులో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని, మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, చాపాడు, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల్లోని రైతులు తమ కంది పంటను విక్రయించుకోవచ్చన్నారు. ముందుగా కంది రైతులు రైతు సేవా కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఖాదర్ వలీ, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి సహదేవరెడ్డి, కోనేటి కృష్ణ ప్రదీప్‌రెడ్డి, సీవీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ యోజన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకాహార విలువల గురించి తెలియజేసేందుకు మండల పరిధిలో జెడ్‌బీఎన్ఎఫ్ విధానంలో మోడల్స్ పండించిన వివిధ రకాలైన ఆకు కూరగాయల ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ ప్రదర్శించిన వాటి వలన కలిగే ప్రయోజనాలను వైద్యాధికారులు డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ కావ్యమాధురి గర్భిణులకు వివరించారు. ప్రతి నెలా నిర్వహించే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ శ్రీనాథరెడ్డి, జెడ్‌బీఎన్ఎఫ్ మెంటార్‌లు రామాంజనేయులు, మహేష్, ఐసీఆర్పీలు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

బద్వేలు అర్బన్ : మెగా డీఎస్సీతోపాటు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి నిరుద్యోగులను ఆదుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే మొదటగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని యువతకు హామీ ఇచ్చిన కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్నా దాని ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆయా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్, రూరల్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 2025-26 సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో చేరుటకు బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తులశమ్మ మంగళవారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మార్చి 6వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 6న ఉదయం 5వ తరగతికి, మధ్యాహ్నం ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు 9000697778 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మాతాశిశు మరణాలు నియంత్రించాలి



బద్వేలు అర్బన్: గర్భిణులకు వైద్యపరీక్షలు అందిస్తున్న వైద్యాధికారి

బద్వేలు అర్బన్ : మాతాశిశు మరణాలు సంభవించకుండా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.జ్యోత్స్న స్వర్ణలత పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ సురక్షిత కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హై రిస్క్ గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు ప్రసవం అయ్యేంత వరకు పర్యవేక్షిస్తుండాలని కోరారు. అలాగే పౌష్టికాహారం వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చంద్రావతి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.కోడూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ అండ్ జస్టిస్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో బి.కోడూరు పీహెచ్‌సీలో జరిగిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రతి నెల 9వ తేదీన జరుగుతున్న పీఎంఎస్ఎంఏ కార్యక్రమం అనేది గర్భిణులకు ఒక వరం లాంటిదన్నారు. గర్భిణులకు అన్నిరకాల పరీక్షలు జరిపి హై రిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా గర్భవతిగా నమోదు అయిన వెంటనే టీకాలు వేయించుకుని ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇచ్చే ఐరన్ మాత్రలు వాడాలన్నారు. అందరూ తప్పక 108 వాహనం ఉపయోగించుకుని ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్ విలియం, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, ఏపీసీజేహెచ్ఆర్ఎఫ్ కడప జిల్లా అధ్యక్షుడు సి.తిరుపాలయ్య, కార్యదర్శి ఎం.శంకర్, ఉపాధ్యక్షుడు కె.చిన్నయ్య, రాష్ట్ర సభ్యులు ఎన్.చందు, అట్లూరు మండల ఉపాధ్యక్షుడు సి.యల్లయ్య, సభ్యులు సందీప్‌కుమార్, ఎం.సుబ్బరాయుడు, బి.కోడూరు మండల ఉపాధ్యక్షుడు కె.నారాయణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.


డార్విన్ సిద్ధాంతాన్ని 'పది'లోనే కొనసాగించాలి

కాశినాయన : డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని పదవ తరగతి సిలబస్‌లోనే ఉంచాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు దాదాపీర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో డార్విన్ జీవపరిణామ సిద్ధాంతంపై జన విజ్ఞాన వేదిక రూపొందించిన కరపత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు దాదాపీర్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానంలో ఇంటర్‌లో కొద్దిమంది మాత్రమే జీవశాస్త్రాన్ని ఎంచుకుంటారని, అందువల్ల పదవ తరగతి పాఠ్యాంశాల నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం వలన విద్యార్థులు జీవ పరిణామంపై అవగాహన పొందలేకపోతున్నారన్నారు. దీంతో పదవ తరగతి పాఠ్యాంశాల్లో తప్పనిసరిగా డార్విన్ సిద్ధాంతం ఉండాలన్నారు. దీని వలన విద్యార్థులు జంతు, వృక్ష జీవరాశిలో ఏవిధంగా శరీర మార్పులు ఏర్పడ్డాయో తెలుసుకుంటారని తెలిపారు. మానవుడు ఏ స్థాయి నుంచి ఈ స్థాయి రూపానికి ఎలా వచ్చాడో విద్యార్థులు తెలుసుకోవడానికి డార్విన్ సిద్ధాంతం తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వం, విద్యాధికారులు, సిలబస్ రూపకర్తలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాకా చంద్రశేఖర్, సురేష్‌కుమార్, మహేష్‌కుమార్, విజయలక్ష్మి, పరిమళజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.


డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి

ప్రొద్దుటూరు క్రైం : ఆటోతో పాటు ఇతర వాహనాలు నడిపేవారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని ప్రొద్దుటూరు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆటో డ్రైవర్లు, ఆటో మొబైల్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ముందుగా ఎల్ఎల్ఆర్ టెస్ట్ పాస్ కావాల్సి ఉంటుందన్నారు. నెల రోజుల తర్వాత డ్రైవింగ్ టెస్ట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను కూర్చోపెట్టుకోరాదని చెప్పారు. ఆటో డ్రైవర్లు తప్పకుండా యూనిఫాం ధరించాలని పేర్కొన్నారు. జాగ్రత్తలు పాటిస్తూ ఆటోలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరగవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు నారాయణనాయక్, హేమకుమార్, రవీంద్రనాయక్, శ్రీనివాసరెడ్డి, ఏఓ కరిముల్లా, ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్ పాల్గొన్నారు.


సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ




ప్రతిభకనబరిచిన విద్యార్థులతో వేదవ్యాస డిగ్రీ కళాశాల యాజమాన్యం




సత్తా చాటిన విద్యార్థులతో ఎస్వీ డిగ్రీ కళాశాల యాజమాన్యం



విద్యార్థులతో లేపాక్షి డిగ్రీ కళాశాల యాజమాన్యం



ప్రతిభకనబరిచిన విద్యార్థులతో రాణితిరుమలదేవి డిగ్రీ కళాశాల యాజమాన్యం



మైదుకూరు: విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు యోగివేమన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చూపారు. యూనివర్సిటీ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్‌లు సాధించారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్‌లో బీఎస్సీ (హానర్స్ జువాలజీ)లో సబీరా, సాహెముస్కాన్ 10కి 10 జీపీఏ, బయోటెక్నాలజీ విభాగంలో విల్మాబ్లెస్సినా, మూడో సెమిస్టర్ బీఎస్సీ (హానర్స్ జువాలజీ)లో మంజులత, మాధవి, తేజస్విని, లక్ష్మీలాలస 10 జీపీఏ సాధించారు. ఫస్ట్ సెమిస్టర్ బీఎస్సీ (జువాలజీ)లో బాలాజీ, గౌసియా బేగం, సుప్రియ 9.5 జీపీఏ, బీఎస్సీ కంప్యూటర్స్‌లో స్వర్ణ 9.5, బీసీఏలో అఖిల 9.5 జీపీఏ, మూడో సెమిస్టర్ బీఎస్సీ (జువాలజీ)లో తస్లీం 9.8, సంధ్య 9.7, శాంతి, చందన 9.5 జీపీఏ సాధించారు. అన్ని గ్రూపుల్లో అత్యధికంగా 9.8, 9.7, 9.5 జీపీఏ సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ, ప్రిన్సిపాల్ మహ్మద్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపాల్ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్మోహన్, హెచ్ఓడీలు గౌరీశంకర్, గంగాభవాని, అధ్యాపకులు అభినందించారు.

లేపాక్షి డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఫస్ట్ సెమిస్టర్ బీఎస్సీలో సుధా 10కి 10 జీపీఏ, ఎం.రాణి, తస్లీం 9.5 జీపీఏ, బీకాంలో హుజీపా, హిమశ్రీ 9.5, మూడో సెమిస్టర్ బీఎస్సీలో రిజ్వాన 9.8, మల్లేశ్వరి, భార్గవి 9.7, బీకాంలో షాహీన్, సానియా 9.3, ఐదో సెమిస్టర్ బీఎస్సీలో భారతి లక్ష్మి 9.49, తేజస్విని 9.22, పూజిత 9.15, నాజియా 9.11, బీకాంలో వనిత 8.77, ముస్కాన్ 8.74 జీపీఏ సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ వీరరాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రాణి తిరుమలదేవి డిగ్రీ కాలేజీ విద్యార్థులు

ఫస్ట్ బీఎస్సీ (హానర్స్ బయోటెక్నాలజీ)లో వెంకటస్వర్ణ 10జీపీఏ, లావణ్య 9.5 జీపీఏ సాధించారు. బీఎస్సీ (హానర్స్ ఎంఎస్‌సీ)లో హర్షిత, శైలజ 9.5, బీకాం కంప్యూటర్స్ (హానర్స్)లో నాగసిద్ధేశ్వరి 9.5, అఫియా, ప్రణతి, రోషన్‌బాను, హలీమా, అంజు 9.0, సెకండ్ బీఎస్సీ (హానర్స్ బయోటెక్నాలజీ)లో ఇమాంబీ 9.7, వాణి 9.4, సుప్రియ 9.25, బీఎస్సీ ఎంఎస్‌సీఎస్ హానర్స్‌లో వీరభార్గవి 9.7, నాగసుమిత్ర 9.5 సాధించారు. అన్ని విభాగాల్లో విద్యార్థులు ఉత్తమ జీపీఏ సాధించారు. వీరిని కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్‌వీ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల విద్యార్థులు యోగివేమన యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ నంద్యాల కొండారెడ్డి, సీఈఓ మీనా కొండారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు యోగివేమన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ చూపారు. మొదటి సెమిస్టర్ బీఎస్సీ విభాగంలో డి.నరేంద్ర, ఎస్.లైబా 10కి 10 జీపీఏ సాధించారు. మద్దిలేటి, రేణుక 9.5 జీపీఏ, సుప్రజ, సాయివెంకట్, మానస 9.0 జీపీఏ సాధించారు. బీకాం కంప్యూటర్స్‌లో అనిత, హరిత 9.5, సబినాబీ, రబియా, సిరిన్ 9.0, మూడో సెమిస్టర్ బీఎస్సీలో సునంద 9.65, బీకాంలో నీరజ 9.0, ఐదో సెమిస్టర్ ఎంపీసీఎస్‌లో చాంద్‌బీ 9.3, నాగేశ్వరి 9.1 జీపీఏ సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపకులు అభినందించారు.

డిగ్రీ విద్యార్థులకు యూనివర్సిటీ ర్యాంకులు

ప్రొద్దుటూరు : స్థానిక ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు యోగివేమన యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల్లో ప్రథమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఫస్ట్ ఇయర్ బీఏ(హానర్స్) చదువుతున్న బషిరున్, హసీనా, ఆఫిఫాలు 10కి 10 పాయింట్లు సాధించి యూనివర్సిటీ ప్రథమ ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫస్ట్ ఇయర్ బీఎస్సీ (హానర్స్ ఫిజిక్స్)కు చెందిన వైష్ణవి 9.50 పాయింట్లతో ప్రథమ ర్యాంక్‌ను, థర్డ్ ఇయర్ బీఎస్సీ (బీజెడ్‌సీ) సుంకు నాగశ్రీ 9.33 పాయింట్లు సాధించినట్లు వివరించారు. వీరిని ప్రిన్సిపాల్ తోపాటు అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత

మైదుకూరు : యోగివేమన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో తమ కళాశాల అన్ని విభాగాల్లో వంద శాతం ఫలితాలను సాధించినట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, రెండో సంవత్సరం బీకాం, మూడో సంవత్సరం బీఎస్సీ (బీజెడ్‌సీ)కి సంబంధించి యూనివర్సిటీ ప్రకటించిన సెమిస్టర్ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. తమ కళాశాలకు చెందిన 5వ సెమిస్టర్ బీఎస్సీ (బీజెడ్‌సీ) విద్యార్థిని ఎస్.స్వరూప 9.74 జీపీఏతో, ఫస్ట్ సెమిస్టర్ బీఏ విద్యార్థిని యామిని 9.5 జీపీఏతో యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్‌ను సాధించినట్లు ప్రిన్సిపాల్ వివరించారు. రెండో సంవత్సరం బీకాం విద్యార్థి వీరభద్ర 9.05 జీపీఏ, మూడో సంవత్సరం బీఏ విద్యార్థిని జె.కవిత 9.0, మొదటి సంవత్సరం బీఎస్సీ విద్యార్థిని సుజాత 9.0, రెండో సంవత్సరం బీఎస్సీ (బాటని) విద్యార్థిని బేబి 8.95, ఎంపీసీఎస్ విద్యార్థి వసంత్ 8.8, సెకండ్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని సౌభాగ్య లక్ష్మి 8.65, ఫస్ట్ బీఎస్సీ (బాటని) విద్యార్థిని స్వాతిక 8.5, ఫస్ట్ బీఎస్సీ (జువాలజీ) విద్యార్థిని వినీల 8.5, ఫస్ట్ బీకాం విద్యార్థిని సాధికా బాను 8.5 జీపీఏ సాధించినట్లు తెలిపారు. కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో కృషి చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు.

మైదుకూరు విద్యార్థినికి ఫస్ట్ ర్యాంక్



ఫాతిమా పర్వీన్

మైదుకూరు : యోగివేమన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో మైదుకూరుకు చెందిన బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థిని యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్‌ను సాధించింది. వైవీయూ డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాలను వెల్లడించింది. ఈ ఫలితాల్లో తమ కళాశాల బీఎస్సీ (బీజెడ్‌సీ) మొదటి సంవత్సరం విద్యార్థిని ఎస్. ఫాతిమా పర్వీన్ మొదటి సెమిస్టర్‌లో 10కి 10 జీపీఏ సాధించి యూనివర్సిటీలో మొదటి ర్యాంక్ సాధించినట్లు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దుగ్గిరెడ్డి ఓబుళరెడ్డి తెలిపారు.